
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY




సంగారెడ్డి
5
మెదక్
జిల్లాల వార్తలు
శుక్రవారం 23 మే 2025

అకాల వర్షంతో ఆగమాగం
- తడిసి ముద్దయిన ధాన్యం
- కొనుగోలు కేంద్రాల్లో బస్తాలకు మొలకలు
- తూకంలో ఎడతెగని ఆలస్యం
- ఆందోళన చెందుతున్న రైతులు

8 లో

విన్నపాలు వినవలె..

నేడు జహీరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన



7

- ఉమ్మడి మెదక్ జిల్లాలో సమస్యల స్వాగతం
- సంగమేశ్వర, బసవేశ్వర సాగునీటి ప్రాజెక్టులపై ఆశలు
- ట్రైడెంట్ చక్కెర కర్మాగారాన్ని తెరిపించాలని రైతుల విన్నపం
- మియాపూర్-సంగారెడ్డి మెట్రోరైలు సాకారమయ్యేనా?
- ఘన్‌పూర్ ప్రాజెక్టు ఎత్తు పెంచాలని డిమాండ్
- పరిష్కారానికి నోచని మల్లన్నసాగర్ నిర్వాసితుల వెతలు
- పెండింగ్‌లో దుబ్బాక, రామాయంపేట, చేర్యాల డివిజన్లు
- సిద్దిపేటలో అభివృద్ధి పనులకు నిధుల కొరత

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తొలిసారి అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడానికి సంగారెడ్డి జిల్లాలో అడుగుపెడుతున్నారు. నేడు ఉదయం జహీరాబాద్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల ప్రచారంతోపాటు ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొనడానికి పలుమార్లు ఆయన ఉమ్మడి జిల్లాకు వచ్చారు. కానీ ఎలాంటి బహిరంగ సభలు నిర్వహించలేదు. గతంలో మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గా ఆలయం, మెదక్ చర్చిలను సందర్శించి అభివృద్ధి పనులు చేపట్టారు. సిద్దిపేట జిల్లాలోనూ ఓ కూల్‌డ్రింక్ కంపెనీ ప్రారంభానికి అప్పట్లో విచ్చేశారు. కానీ, తొలిసారి ప్రజల సమక్షంలో బహిరంగసభలో మాట్లాడనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన రాకపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆశలు పెట్టుకున్నారు. జిల్లాలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం నిధులు విడుదల చేస్తారని.. కొత్త వరాలు కురిపిస్తారని ఎదురుచూస్తున్నారు.

-ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మే 22



నిలిచిపోయిన సింగూరుకు నీటిని తరలించే కాళేశ్వరం కాలువ



జహీరాబాద్‌లో సిద్ధమవుతున్న సీఎం రేవంత్‌రెడ్డి సభావేదిక

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా జాగ్రత్తలు

రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



హుగ్గెల్లిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి దామోదర్, ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్

జహీరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ డివిజన్‌లో నేడు జరగనున్న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. సీఎం పర్యటన ఏర్పాట్లను గురువారం ఆయన ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్, కలెక్టర్ వల్లూరు క్రాంతి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎస్పీ పంకజ్‌పరితోష్ తదితరులతో కలిసి పరిశీలించారు. అనంతరం వివిధ శాఖలకు చెందిన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సభాప్రాంగణం వద్ద ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రముఖుల సీటింగ్ ఏర్పాట్లు ఎలాచేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. వీఐపీల గ్యాలరీ, ప్రజావేదిక తదితరాలపై ఆరా తీశారు. సీఎం ప్రారంభించనున్న కేంద్రీయ విద్యాలయం, బసవేశ్వర విగ్రహం, హెలిప్యాడ్ వద్ద పనులు, వాహనాల పార్కింగ్ కోసం చేస్తున్న ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బహిరంగ సభావేదిక వద్ద రాత్రి వరకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని సూచించారు. సభకు హాజరయ్యే ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, సెట్విన్ కార్పొరేషన్ ఛైర్మన్ గిరిధర్‌రెడ్డి, మాజీమంత్రి చంద్రశేఖర్, నాయకుడు ఉజ్వల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి : ఎంపీ

సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనకు నియోజకవర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్, సెట్విన్ కార్పొరేషన్ ఛైర్మన్ గిరిధర్ రెడ్డి, మాజీమంత్రి చంద్రశేఖర్, రాష్ట్ర నాయకుడు సిద్ధం ఉజ్వల్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఎంపీ కార్యాలయంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. సీఎం సభకు 30 వేల మంది తరలివస్తారని అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. రెండ్రోజుల క్రితం మాజీ మంత్రి హరీశ్‌రావు జహీరాబాద్ వచ్చిన సందర్భంగా మాట్లాడుతూ సీఎంపై అర్థంలేని విమర్శలు చేశారని మండిపడ్డారు. ఆయన విమర్శల్లో పసలేదని, ప్రజలు పట్టించుకోరని అన్నారు. సమావేశంలో నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

రాయితీ వంటగ్యాస్ పక్కదారి

ఎక్కడ చూసినా ఎర్ర సిలిండరే!

- వాణిజ్య అవసరాలకు మళ్లింపు
- హోటళ్లు, తినుబండారాల షాపుల్లో విచ్చలవిడిగా వినియోగం
- సివిల్‌సప్లై అధికారుల ఉదాసీనత
- వినియోగదారుల సబ్సిడీకి గండి
- మెదక్ జిల్లాలో కమర్షియల్ కనెక్షన్లు 460 మాత్రమే!



మెదక్‌లో ఓ హోటల్‌లో వినియోగిస్తున్న గృహ వినియోగ గ్యాస్ సిలిండర్



టేక్మాల్‌లో ఓ చాయ్‌బండి వద్ద వాడుతున్న గృహ సబ్సిడీ గ్యాస్

మెదక్, మే 22 (ఆంధ్రజ్యోతి): వంటగ్యాస్ పక్కదారి పడుతోంది. గృహవినియోగ కనెక్షన్ల ద్వారా ప్రభుత్వం రాయితీపై సరఫరా చేసే సిలిండర్లను హోటళ్లు, తినుబండారాల షాపుల్లో వినియోగిస్తున్నారు. మరోవైపు వాహనాలకు ఇంధనంగానూ రీఫిల్ చేస్తున్నారు. ఇలా ప్రతీ రోజూ జిల్లావ్యాప్తంగా వేలాది సిలిండర్లు వాణిజ్య అవసరాలకు తరలిపోతున్నాయి. గ్యాస్ కంపెనీలకు లబ్ధిదారుల పేరిట నేరుగా గ్యాస్ బుక్ చేసుకునే వెసులుబాటు ఉండడంతో అక్రమాలకు తెరలేస్తున్నదనే ఆరోపణలున్నాయి.

2,35,412 కనెక్షన్లు

మెదక్ జిల్లావ్యాప్తంగా మొత్తం 2,35,412 వంటగ్యాస్ కనెక్షన్లున్నాయి. ఇందులో 1,08,688 సాధారణ గృహవినియోగ కనెక్షన్లు, 33,618 ఉజ్వల, 63,161 దీపం, 29,485 సీఎస్ఆర్ గ్యాస్ కనెక్షన్లున్నాయి. వాణిజ్య అవసరాలకు వినియోగించే గ్యాస్‌కనెక్షన్లు మాత్రం కేవలం 460 మాత్రమే ఉన్నట్లు జిల్లా పౌర సరఫరాల అధికారులు పేర్కొంటుండడం విడ్డూరంగా ఉంది. మెదక్ పట్టణంలో (బీపీసీ) 80 వాణిజ్య వినియోగ కనెక్షన్లు ఉండగా, రామాయంపేటలో ఒక్క కమర్షియల్ గ్యాస్ కనెక్షన్ కూడా ఇప్పటివరకూ నమోదు కాలేదు. హవేళీఘనపూర్, చేగుంట మండలాల పరిధిలో కూడా వాణిజ్య వినియోగ కనెక్షన్లు తీసుకోలేదు. మండలాలవారీగా పాపన్నపేట-4, నర్సాపూర్-7, టేక్మాల్-8, రేగోడ్-5, కౌడిపల్లి-14, వెల్దుర్తి-12, మెదక్ మండలం-80, తూప్రాన్-73, శివంపేట-80, నర్సాపూర్-49, మెదక్ -35, మెదక్ -48, కౌల్లకల్- 34 కమర్షియల్ కనెక్షన్లు ఉన్నట్లు అధికారుల లెక్కలు తెలుపుతున్నాయి.

సబ్సిడీ పక్కదారి

గ్యాస్ కనెక్షన్ల లెక్క చూస్తే సబ్సిడీ గ్యాస్ ఎలా పక్కదారి పడుతున్నదో అర్థమవుతున్నది. జిల్లాలో వేలల్లో హోటళ్లు, వంటకాల దుకాణాలు

మిగతా 8వ పేజీలో..



వర్షం మాటున విషం..

- వరద నీటిలోకి రసాయన వ్యర్థాలు వదులుతున్న పరిశ్రమలు
- నెలలపాటు నిల్వ చేసి వానొచ్చినప్పుడు బయటకు
- కాలుష్య కాసారంగా మారుతున్న చెరువులు, కుంటలు
- దెబ్బతింటున్న పొలాలు
- మూగజీవాలు, చేపలు మృత్యువాత
- చోద్యం చూస్తున్న 'పీసీబీ'

6

జై హనుమాన్

హనుమాన్ జయంతిని గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామంలో హనుమాన్ ఆలయంలో స్వామి విగ్రహాన్ని తీరొక్క పూలు, పండ్లతో ఇలా అందంగా అలంకరించారు.

-మనోహరాబాద్ (ఆంధ్రజ్యోతి)



కన్నతల్లే కడతేర్చింది!

- అపహరణకు గురైన బాలుడి కథ విషాదాంతం
- చంపి బావిలో పడేసి కిడ్నాప్ డ్రామా ఆడినట్లు వెల్లడి
- మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

6

వెబ్‌సైట్‌లో వైద్యశాఖ ఉద్యోగాల

ప్రొవిజినల్ జాబితా

- ఏడు కేటగిరీ పోస్టుల జాబితాలు మాత్రమే వెల్లడించిన అధికారులు
- రేపటి వరకు అభ్యంతరాల స్వీకరణ
- మిగతా పోస్టులపై సమాచారం కరువు



సంగారెడ్డిలోని డీఎంహెచ్‌వో కార్యాలయం

సంగారెడ్డి అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో భర్తీచేయనున్న పోస్టుల్లో కొన్నింటి ప్రొవిజినల్ జాబితాను అధికారులు విడుదల చేశారు. జాతీయ ఆరోగ్య మిషన్ కింద కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి ఆ శాఖ చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. మొత్తం 117 పోస్టుల భర్తీకి గత నెల 29న నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల 3 వరకు దరఖాస్తులు స్వీకరించగా 3,110 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఏడు కేటగిరీల పోస్టుల అభ్యర్థుల ప్రొవిజినల్ జాబితాలను జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో వైద్యశాఖ పొందుపరిచింది. ఆయా పోస్టులకు ఈ నెల 24 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామని పేర్కొన్నారు.

మిగతా పోస్టులపై సస్పెన్స్

ఉద్యోగాల నియామకాల్లో భాగంగా 21 పోస్టులకు నోటిఫికేషన్ జారీచేసి, కేవలం ఏడు కేటగిరీ పోస్టులకు సంబంధించిన ప్రొవిజినల్ జాబితానే వెబ్‌సైట్‌లో ఉంచడంతో మిగతా పోస్టుల సంగతేంటని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. గతేడాది నోటిఫికేషన్ మాదిరిగా ఒకట్రెండు కేటగిరీ పోస్టులు భర్తీ చేసి మమ అనిపిస్తారా అని సందేహాలను వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా అభ్యంతరాలకు కేవలం రెండు రోజులు మాత్రమే గడువు ఇవ్వడమేమిటని ప్రశ్నిస్తున్నారు. విచిత్రమేమంటే ప్రొవిజినల్ జాబితాలను గురువారం రాత్రి వరకు డీఎంహెచ్‌వో కార్యాలయ నోటీసు బోర్డులో ప్రదర్శించనేలేదు. కానీ జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో మాత్రం గుట్టుగా విడుదల చేశారు. అభ్యర్థులు అప్రమత్తమై వెబ్‌సైట్‌ను పరిశీలిస్తే జాబితాలో తప్పుగా వివరాలు నమోదైతే మార్పులు చేర్పులకు అవకాశం ఉంటుంది. లేకపోతే ఆయా అభ్యర్థులు నష్టపోవడం ఖాయం. ప్రొవిజినల్ జాబితా విడుదల చేసినట్లుగానీ, అభ్యంతరాలు స్వీకరిస్తామనిగానీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఎటువంటి పత్రిక ప్రకటన జారీ చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది.



వర్షానికి జలమయమైన మెదక్ బస్‌డిపో ప్రాంగణం

మెదక్‌లో రికార్డుస్థాయి వర్షం

24 గంటల్లో 119 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

మెదక్, మే 22 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. జిల్లా కేంద్రంలో వాన దంచికొట్టడంతో రహదారులు జలమయమయ్యాయి. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో గడిచిన 24 గంటల్లో 119 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. జిల్లాలోని మాసాయిపేటలో 112 మి.మీ.లు, తూప్రాన్‌లో 74 మి.మీ.లు, చేగుంటలో 76.5 మి.మీ.లు, వెల్దుర్తిలో 85.3 మి.మీ.లు, రామాయంపేటలో 61.4 మి.మీ.లు, కౌల్దారంలో 85.8 మి.మీ.లు, మనోహరాబాద్‌లో 76.4 మి.మీ.ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణశాఖ వెల్లడించింది. జిల్లావ్యాప్తంగా ఇంకా ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాలకు తెస్తుండడంతో కురుస్తున్న వానలకు ధాన్యం తడిసి ఇబ్బందుల పాలవుతున్నారు. తడిసిన వడ్లనూ కొనుగోలు చేస్తామని సివిల్‌సప్లై అధికారులు రైతులకు భరోసా ఇస్తున్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు షురూ

మెదక్ అర్బన్/సంగారెడ్డి అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం, అరబిక్ సబ్జెక్టుల పరీక్షలు ప్రశాంతగా జరిగాయి. సంగారెడ్డి జిల్లాలో 28 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫస్టియర్ పరీక్షకు 3459 మందికి 3211 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండియర్ పరీక్షకు 820 మందికి 761 మంది హాజరయ్యారు. మెదక్ జిల్లాలో ప్రథమ సంవత్సరం పరీక్షలకు జనరల్ విభాగంలో 1,088 మందికి 1,011 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 77 మందికి 69 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షకు జనరల్ విభాగంలో 362 మందికి 333, ఒకేషనల్ విభాగంలో మొత్తం ఏడుగురు హాజరైనట్లు అధికారులు వెల్లడించారు.

శిశుగృహకు శిశువు తరలింపు

సంగారెడ్డి అర్బన్, మే 22(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని ఎంసీహెచ్ ఆవరణలో లభ్యమైన గుర్తు తెలియని శిశువును శిశుగృహకు తరలించారు. ఈ నెల 17 న గుర్తుతెలియని వ్యక్తులు ఆస్పత్రి ప్రాంగణంలో శిశువును వదిలేసి వెళ్లిన విషయం తెలిసిందే. అయితే లభ్యమైన పసికందును ఇన్ని రోజులు ఎంసీహెచ్‌లోని ఎస్ఎన్‌సీయూలో ఇంక్యూబేటర్‌లో ఉంచి చికిత్స అందించారు. శిశువు పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నట్లు నిర్ధారించుకున్న ఆస్పత్రి అధికారులు శిశుగృహకు అప్పగించారు.

వర్షం మాటున విషం

చెరువుల్లోకి వ్యర్థ రసాయన జలాలు వదులుతున్న పరిశ్రమలు

- నెలలపాటు నిల్వ చేసి వానొచ్చినప్పుడు వదులుతున్న యాజమాన్యాలు
- కలుషిత, విషపూరిత జలాలతో నిండుతున్న చెరువులు, కుంటలు
- పాడవుతున్న పంట పొలాలు.. మూగజీవాలు, చేపల మృత్యువాత
- చోద్యం చూస్తున్న పీసీబీ అధికారులు



రసాయన జలాలతో నిండిన దోమడుగు నల్లకుంట చెరువు

గుమ్మడిదల, మే 22 (ఆంధ్రజ్యోతి) : వానొచ్చనంటే.. వరదొస్తది.. వరదతోపాటు రసాయనాలొస్తాయి.. అన్నట్లుగా మారింది గుమ్మడిదల మండలంలోని పలు ప్రాంతాల పరిస్థితి. మండలంలోని బొంతపల్లి పారిశ్రామిక వాడలో వర్షపు నీటిలో పరిశ్రమల నుంచి వెలువడే రసాయన వ్యర్థ జలాలు వదులుతున్నారు. భారీ వర్షం వచ్చినప్పుడల్లా ఈ పారిశ్రామిక వాడలోని ఫార్మసీ, పెద్ద పెద్ద పరిశ్రమలు నెలలపాటు నిల్వ చేసిన వ్యర్థ జలాలను అవుట్ లైన్ ద్వారా బయటికి వదులుతున్నారు. ఆ వరద నీరంతా సమీపంలోని చెరువులు, కుంటల్లో వచ్చి చేరుతుండంతో కాలుష్య కాసారంగా మారతున్నాయి. రైతుల పొలాల మీది నుంచి వరద పరుగు పెడుతుండడంతో రసాయనాల ఘాటుకు పంటలన్నీ నాశనమవుతున్నాయి. అంతేకాకుండా చెరువులు, కుంటల్లోని చేపలు, నీటిని తాగుతున్న మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. పరిశ్రమల కలుషిత జలాలను బయటికి రాకుండా అరికట్టాల్సిన పీసీబీ అధికారులు చోద్యం చూస్తుండడంతో సదరు యాజమాన్యాలు మరింత రెచ్చిపోతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. బుధవారం కురిసిన భారీ వర్షానికి దోమడుగు గ్రామంలోని నల్లకుంట. ఇతర వాగులు పెద్ద పరిశ్రమ నుంచి వచ్చిన రసాయన జలాలతో నిండాయి. ఎకరాల కొద్ది వరి పంట నాశనమైంది. ప్రజల ఆరోగ్యంపై కూడా ఈ కలుషిత జలాల ప్రభావం తీవ్రంగా పడుతుందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పరిశ్రమల వ్యర్థ జలాలు బయటకు రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లా మంత్రి దృష్టికి తీసుకుపోతాం



వర్షాన్ని అడ్డుపెట్టుకొని కొన్ని పరిశ్రమలు విచ్చలవిడిగా రసాయన జలాలను అవుట్ లైన్ ద్వారా బయటికి వదిలుతున్నారు. దీంతో పంటలు దెబ్బతింటున్నాయి. కుంటలు, చెరువులు కలుషితంగా మరాయి. ఈ ప్రాంతాన్ని కాలుష్యమయంగా మారుస్తున్న రసాయన పరిశ్రమలను గుర్తించి చర్యలు తీసుకోవాలి. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు జిల్లా మంత్రి దృష్టికి తీసుకుపోతాం.

-పుట్ట నర్సింగరావు,
కాంగ్రెస్ మండల అధ్యక్షుడు



దోమడుగులో రసాయన జలాల కారణంగా పాడైన వరి పంట















బావిలో నుంచి వెలికి తీసిన బాలుడి మృతదేహం (వృత్తంలో), బాలుడి ఫైల్ ఫొటో

కన్నతల్లే కడతేర్చింది!

- అపహరణకు గురైన బాలుడి కథ విషాదాంతం
- చంపి బావిలో పడేసి కిడ్నాప్ డ్రామా ఆడినట్లు వెల్లడి
- మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

దుబ్బాక, మే22(ఆంధ్రజ్యోతి): అభం శుభం తెలియని రెండునెలల బాలుడిని తల్లే చంపేసి బావిలో పడేసింది.. ఆపై తన ఒడిలోనుంచి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని కిడ్నాప్ డ్రామా ఆడి.. చివరకు కటకటాలపాలైంది. గురువారం ఆలస్యంగా వెలుగు చూసిన ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం అప్పనపల్లి గ్రామంలో శ్రీమాన్, కవిత దంపతుల రెండు నెలల బాలుడి అపహరణ మిస్టరీగా మారింది. తన భర్త ఈ నెల 17న పనికోసం మిరుదొడ్డి మండలం రుద్రారం గ్రామానికి వెళ్లగా ఇంటి వద్ద బాబుతో ఉంటున్నానని, బుధవారం సాయంత్రం ఇద్దరు వ్యక్తులు మాస్కులు ధరించి వచ్చి మాటకలుపుతూ ఒక్కసారిగా తన ఒడిలోని బాలుడిని అపహరించుకుని పోయారని కవిత పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నది. తాను అరిచినా కూడా చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో రాలేదని పేర్కొన్నది. ఈ మేరకు దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్ఐ గంగరాజు కిడ్నాప్ కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తును ముమ్మరం చేశారు. తీరా విచారణలో కవితనే తన కుమారుడిని కడతేర్చినట్లు తేలింది. బాలుడిని చంపి గ్రామంలోని ఓ బావిలో పడేసి.. కిడ్నాప్ కథ అల్లినట్లుగా చెప్పింది. ఆమె ఇచ్చిన సమాచారం మేరకు దుబ్బాక సీఐ శ్రీనివాస్, ఎస్ఐ గంగరాజు అక్కడికి చేరుకుని పసిబాలుడిని మృతదేహాన్ని వెలికితీశారు. దీంతో ఒక్కసారిగా ఆ ప్రాంతమంతా స్థానికుల రోదనలతో నిండిపోయింది. అయితే ఇంకా కేసు విచారణ దశలో ఉందని, పూర్తయిన వెంటనే వివరాలు వెల్లడిస్తామని దుబ్బాక సీఐ శ్రీనివాస్ తెలిపారు. కేసు విచారణ దశలో ఉండటంతో పోలీసులు పూర్తి వివరాలను అందించడంలేదు. పసిబాలుడిని ఎందుకు హతమార్చాల్సి వచ్చిందనే కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

ఆగి ఉన్న డీసీఎంను ఢీకొన్న బైక్

- ఒకరి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు



మహేష్ (ఫైల్)

చేగుంట, మే 22 (ఆంధ్రజ్యోతి) : ఆగి ఉన్న డీసీఎంను బైక్ వెనుక నుంచి ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన చేగుంట మండల పరిధిలోని వడియారం గ్రామ శివారులో చోటుచేసుకుంది. చేగుంట ఎస్ఐ చైతన్యకుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం చిన్న శంకరంపేట మండలం సూరారం గ్రామానికి చెందిన పిట్ల మహేష్ (22) అదే గ్రామానికి చెందిన తన మిత్రుడు గొల్ల మధుతో కలిసి మాసాయిపేటలో తన మిత్రుడి పుట్టిన రోజు వేడుకలకు వెళ్లాడు. బుధవారం అర్ధరాత్రి బైక్‌పై తిరిగి వస్తుండగా వడియారం గ్రామ శివారులోని రోడ్డు పక్కకు ఆగి ఉన్న డీసీఎం వ్యాన్‌ను వెనుక నుంచి ఢీకొనడంతో మహేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మధుకు తీవ్ర గాయాలు కాగా చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మహేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లి కమలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



పరుశరాములు (ఫైల్)

నిజాంపేట, మే 22(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిజాంపేట మండల పరిధిలోని చల్మెడ గ్రామానికి చెందిన కంపే పరుశరాములు(34) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసేవాడు. అతడు ప్రైవేట్ ఫైనాన్స్‌లో 80వేలు లోన్ తీసుకుని ట్రాక్టర్ కొనుగోలు చేయడంతోపాటు తెలిసినవారి వద్ద కొంతమేర అప్పులు చేశాడు. కొన్ని నెలలుగా ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో ట్రాక్టర్ కిస్తీలు కట్టలేక, మరోవైపు బయట తెచ్చిన అప్పులు తీర్చే మార్గం లేక బుధవారం రాత్రి తన ఇంట్లోని దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య బాలమణి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పీఎస్ఐ సృజన తెలిపారు.

అకౌంట్ నుంచి రూ.34 వేలు మాయం

- పీఎం కిసాన్ యాప్ ద్వారా బదిలీ అయినట్లు గుర్తించిన బ్యాంకు అధికారులు

హత్నూర, మే 22 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్ అకౌంట్ నుంచి రూ.34వేలు పీఎం కిసాన్ యాప్ ద్వారా పోయినట్లు బాధితుడు గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. హత్నూర మండలం ముచ్చర్ల గ్రామానికి చెందిన ఎరుకల యాదగిరి తన బ్యాంకు ఖాతాలో నుంచి పీఎం కిసాన్ యాప్ ద్వారా ఈ నెల 18న రూ.34వేలు కట్ అయినట్లు గుర్తించాడు. దీంతో దౌల్తాబాద్‌లోని ఇండియన్ బ్యాంకుకు వెళ్లి అధికారులను ఆరా తీయగా పీఎం కిసాన్ యాప్ ద్వారా కట్ అయ్యాయని వారు నిర్ధారించారు. వెంటనే బాధితుడు మీసేవ ద్వారా సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తాజాగా గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై ఎస్ఐ శ్రీధర్ రెడ్డిని సంప్రదించగా.. బాధితుడు ఎరుకల యాదగిరి తనకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడని తెలిపారు. ఇలాంటి సైబర్ నేరాలు జరిగిన రెండు గంటల్లోపు లేదా ఒక రోజులోపు సమాచారం ఇస్తే డబ్బులు రికవరీ అయ్యే అవకాశం ఉందన్నారు. ఓటీపీలు గాని ఇతర యాప్‌ల ద్వారా లింకులు వస్తే షేర్ చేయవద్దని ఎస్ఐ సూచించారు.

పాముకాటుతో పాడి ఆవుల మృతి



చేర్యాల, మే 22 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో పాముకాటుకు గురై రెండు పాడి ఆవులు మృతి చెందిన సంఘటన గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సోంరెడ్డి యశ్వంత్ రెడ్డి రోజులాగే బుధవారం వ్యవసాయపనులు ముగించుకుని పాడిఆవులను వ్యవసాయబావివద్ద కట్టివేసి ఇంటికి చేరుకున్నాడు. గురువారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూసేసరికి రెండు ఆవులు మృత్యువాత పడి ఉన్నాయి. ఆందోళన చెందిన అతను చుట్టపక్కల పరిశీలించగా పాములు సంచరిస్తూ కనిపించడంతో పాముకాటుకు గురై ఆవులు మృతిచెందాయని గుర్తించాడు. మృతిచెందిన ఆవుల విలువ రూ.2.60లక్షల ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

ధాన్యం లారీ బోల్తా

- డ్రైవర్‌కు స్వల్ప గాయాలు

వెల్దుర్తి, మే 22 (ఆంధ్రజ్యోతి) : అదుపుతప్పి ధాన్యం లారీ బోల్తాపడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. మంగళపర్తి పీఏసీఎస్ కొనుగోలు కేంద్రం నంచి ధాన్యాన్ని నింపుకుని వెల్దుర్తి రైస్‌మిల్లుకు వస్తున్న క్రమంలో మండల పరిధిలోని మన్నెవారి జలాల్‌పూర్ మూలమలుపు వద్ద అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్ ఇస్మాయిల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. లారీలో ఉన్న 693 ధాన్యం బస్తాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. విషయం తెలుసుకున్న తహసీల్దార్ బాలలక్ష్మి, ఆర్ఐ నర్సింగ్‌యాదవ్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.



బోల్తా పడిన లారీ

ముఖ్యమంత్రికి సీపీఎం బహిరంగ లేఖ

సంగారెడ్డి రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి సంగారెడ్డి జిల్లాలో పర్యటిస్తున్న నేపథ్యంలో సీపీఎం పార్టీ బహిరంగ లేఖను విడుదల చేసింది. ఈ లేఖను సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో గురువారం సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ విడుదల చేశారు. జిల్లాలో వందలాది పరిశ్రమల్లో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారని, వారికి కనీస వేతనాలు, ఈఎస్‌ఐ, పీఎఫ్ ఇతర చట్టపరమైన సౌకర్యాలు అమలు కాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని లేఖలో పేర్కొన్నారు. కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఆర్‌ఆర్‌ఆర్‌తో పాటు, జహీరాబాద్‌లోని నిమ్జ్‌తో భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారంతో పాటు పునరావాసం కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మంజీరా నదిపై ఎత్తిపోతల ప్రాజెక్టు ఏర్పాటు చేసి నారాయణఖేడ్, జహీరాబాద్, అందోల్, సంగారెడ్డికి పూర్తిస్థాయిలో సాగునీరందించాలని కోరారు. జిల్లాలోని అన్ని గ్రామాలకు మంజీరా జలాలు సరఫరా చేయాలని, మంజీరాను కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధి భేష్

● బీహార్ రాష్ట్ర సర్పంచులు కితాబు



గూడెంగడ్డలో బీహార్ రాష్ట్ర సర్పంచ్‌లు

నర్సాపూర్, మే 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధి ఎంతో అద్భుతంగా ఉందని బీహార్ రాష్ట్ర సర్పంచులు అభినందించారు. 90 మంది బీహార్ రాష్ట్ర సర్పంచులు రెండు బృందాలుగా గురువారం నర్సాపూర్ మండలం గూడెంగడ్డం, నారాయణపూర్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో గ్రామస్థులతో మాట్లాడటమే కాకుండా గ్రామాల్లో పాలన విధానం, చేసిన అభివృద్ధి, నిధుల తీరును అడిగి తెలుసుకున్నారు. చెత్త సేకరించి డంపుయార్డుకు తరలించే విధానంతో పాటు, నర్సరీ, శ్మశానవాటికలను సందర్శించారు. ప్రతీ ఇంటికి మిషన్‌భగీరథ నీటి సరఫరాను తెలుసుకున్నారు. బృందం వెంట ఎంపీడీవో మాధవిలత, ఏపీఎం గౌరిశంకర్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

కొండపోచమ్మను సందర్శించిన ఉజ్బెకిస్థాన్ అధికారులు

మర్కుక్, మే 22 (ఆంధ్రజ్యోతి): కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్‌ను ఉజ్బెకిస్థాన్ ఉన్నతాధికారులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా కార్యనిర్వాహక ఇంజనీర్ రఘునాథ్ ప్రసాద్ వారికి కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్ నిర్మాణ ప్రక్రియను వివరించారు. రిజర్వాయర్ నిర్మాణంలో వినియోగించిన ఆధునిక సాంకేతిక, నిర్మాణంలో ఎదురైన సవాళ్లను వివరించారు.



మూతపడిన ట్రైడెంట్ చక్కెర ఫ్యాక్టరీ

విన్నపాలు వినవలె

- నేడు జహీరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన
- ఉమ్మడి మెదక్ జిల్లాలో సమస్యల స్వాగతం
- సంగమేశ్వర, బసవేశ్వర సాగునీటి ప్రాజెక్టులపై ఆశలు
- ట్రైడెంట్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాల్సిన అవసరం
- పరిష్కారానికి నోచని మల్లన్నసాగర్ నిర్వాసితుల వెతలు
- పెండింగ్‌లో దుబ్బాక, రామాయంపేట, చేర్యాల డివిజన్లు
- సిద్దిపేటలో అభివృద్ధి పనులకు నిధుల కొరత
- మియాపూర్-సంగారెడ్డి మెట్రోరైలు సాకారమయ్యేనా?
- ఘన్‌పూర్ ప్రాజెక్టు ఎత్తు పెంచాలని డిమాండ్

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మే 22 : రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు అతి సమీపంలో ఉన్న ఉమ్మడి మెదక్ జిల్లాలో పలు సమస్యలు నెలకొన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొన్ని అభివృద్ధి పనులు చకచకా సాగుతున్నాయి. కానీ పెండింగ్ పనులతోపాటు కొత్తగా చేపట్టాల్సిన పనులు ప్రశ్నార్థకంగా మిగిలాయి.

ప్రాజెక్టుల్లో వేగం పెరిగేనా?

సంగారెడ్డి, అందోల్, జహీరాబాద్, నారాయణఖేడ్ నియోజకవర్గాలను సస్యశ్యామలం చేసే సంగమేశ్వర, బసవేశ్వర సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ఒక అడుగు ముందుకు.. పది అడుగులు వెనక్కు అన్నట్లుగా సాగుతోంది. సుమారు 4 లక్షల ఎకరాలకు సాగునీరందించే ఈ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అదే విధంగా మల్లన్నసాగర్ రిజర్వాయర్ ముంపు నిర్వాసితుల సమస్యలు ఎక్కడివక్కడే ఉన్నాయి. మల్లన్నసాగర్, రంగనాయకసాగర్, కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్లకు అనుసంధానంగా కాలువల నిర్మాణం నిలిచిపోయాయి. మెదక్ జిల్లాలోని ఘన్‌పూర్ మధ్యతరహా ప్రాజెక్టు ఎత్తు పెంచితే మరింత ఆయకట్టుకు లబ్ధి చేకూరుతుంది. జహీరాబాద్ ప్రాంతంలోని నారింజ వాగు ప్రాజెక్టును అభివృద్ధి చేస్తే 3 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఇవన్నీ వేగం పుంజుకోవాలంటే నిధులు అవశ్యం.

రెవెన్యూ డివిజన్లపై డిమాండ్‌లు

సిద్దిపేట జిల్లాలో దుబ్బాక, చేర్యాల, మెదక్ జిల్లాలో రామాయంపేట, సంగారెడ్డి జిల్లాలో పటాన్‌చెరు పట్టణాలకు రెవెన్యూ డివిజన్ హోదా కల్పిస్తామని ఎన్నికల్లో అన్ని పార్టీలు హామీలు ఇచ్చారు. ఈ ప్రతిపాదనలకు సంబంధించి ఉన్నతాధికారులు సైతం పరిశీలించారు. కానీ కొత్త డివిజన్లు సాకారం కాలేదు. రెవెన్యూ డివిజన్లపై సీఎం ప్రస్తావించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రశ్నార్థకంగా నిమ్జ్ భూసేకరణ

జహీరాబాద్ నియోజకవర్గంలోని ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లోని 17 గ్రామాలను పారిశ్రామిక స్పెషల్ జోన్‌గా మార్చడానికి నిమ్జ్‌కు శ్రీకారం చుట్టారు. 12 వేల ఎకరాలను సేకరించి పరిశ్రమలను ఏర్పాటు చేయాలని భావించారు. ఇప్పటివరకు కేవలం 4 వేల ఎకరాలను మాత్రమే సేకరించడం జరిగింది. కానీ ఎలాంటి పరిశ్రమలను నెలకొల్పలేదు. అయితే, పారిశ్రామిక ప్రగతికి సంకేతంగా రూ.100 కోట్లతో రహదారిని మాత్రం నిర్మించారు. నేడు సీఎం దీనిని ప్రారంభిస్తున్నారు. కొన్ని పరిశ్రమలు ఏర్పాటైతే నిమ్జ్‌కు ఆటంకాలు తొలగిపోతాయి.



పటాన్‌చెరులో రహదారుల దుస్థితి

ఉమ్మడి జిల్లాలో చేయాల్సినవి..

- నారాయణఖేడ్ ప్రాంతంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయిస్తే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.
- నారాయణఖేడ్‌లో మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు కలగా మారింది.
- జహీరాబాద్ నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి రూ.400 కోట్ల నిధులు అవసరం.
- జహీరాబాద్ మండలం కొత్తూరు-బి సమీపంలోని ట్రైడెంట్ చక్కెర కర్మాగారాన్ని తిరిగి పునరుద్ధరించాలి.
- కోహీర్ మండలంలో రెండేళ్ల కిందట హోటల్ మేనేజ్మెంట్ కళాశాల మూతబడింది. దీనికోసం రూ.12 కోట్లు ఖర్చు చేశారు. తిరిగి ప్రారంభించాల్సిన అవసరం ఉంది.
- ఝరాసంగంలోని శ్రీకేతకీ సంగమేశ్వర ఆలయానికి రూ.28 కోట్లతో అభివృద్ధి చేయాలని అంచనా వేశారు. ఈ నిధులు విడుదల చేయాలి.
- గజ్వేల్-ప్రజ్ఞాపూర్ రింగురోడ్డును పూర్తి చేయించాలి.
- నర్సాపూర్ నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. డబుల్ బెడ్రూంలు మధ్యలోనే ఆగిపోయాయి.
- సిద్దిపేట నియోజకవర్గంలో నిధుల కొరత కారణంగా వెయ్యి పడకల ప్రభుత్వ ఆస్పత్రి, నర్సింగ్ కళాశాల, సమీకృత మార్కెట్ యార్డు, రంగనాయకసాగర్, కోమటిచెరువు టూరిజం పనులు నిలిచిపోయాయి.
- పటాన్‌చెరు నియోజకవర్గ కేంద్రం నుంచి దౌల్తాబాద్ వరకు రహదారి అధ్వాన్నంగా మారింది.
- కొల్లూరు గ్రామ శివారులో ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డును పునరుద్ధరించడానికి రైల్వే ఓవర్ బ్రిడ్జిని త్వరగా పూర్తి చేయించాలి.
- పటాన్‌చెరు నియోజకవర్గంలోని లకడారం, చిన్న కంజర్ల, మాదారం గ్రామాల్లో స్టోన్ క్వారీలను మూసివేయాలనే డిమాండ్లు నెలకొన్నాయి.
- పటాన్‌చెరు నియోజకవర్గం పాశమైలారం, ఇస్నాపూర్, రుద్రారం, ఐడీఏ బొల్లారం గ్రామాల్లోని రసాయన పరిశ్రమల నుంచి వెదజల్లే కాలుష్యాన్ని నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.
- మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు మెట్రోరైలు కోసం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. అదే విధంగా సంగారెడ్డి వరకూ దీనిని పొడిగించాలనే విన్నపాలు వినిపిస్తున్నాయి. ఐటీ హైదరాబాద్‌తోపాటు జిల్లా కేంద్రమైన సంగారెడ్డికి మెట్రో ఉంటే ప్రయోజనంగా ఉంటుంది. సాధ్యాసాధ్యాలపై సీఎం చర్చించాలని విన్నవిస్తున్నారు.

జోగిపేట పీజీ కళాశాలలో కొత్త కోర్సులు

- త్వరలో డేటా సైన్స్, ఎంబీఏ కోర్సుల ప్రారంభం
- నర్సాపూర్ పీజీ కళాశాలలో సీట్లను పెంచుతాం
- ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్, ప్రొఫెసర్ కుమార్ మొలుగరం

జోగిపేట/నర్సాపూర్, మే 22 (ఆంధ్రజ్యోతి) : అదనంగా స్థలాన్ని కేటాయిస్తే జోగిపేట పీజీ కళాశాలలో కొత్త కోర్సులను ప్రారంభిస్తామని, విద్యార్థుల డిమాండ్ మేరకు నర్సాపూర్ పీజీ కళాశాలలో మరిన్ని సీట్లను పెంచుతామని ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ మొలుగరం కుమార్ అన్నారు. గురువారం ఆయన జోగిపేట, నర్సాపూర్ పీజీ కళాశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీ కాలేజీల్లో మౌలిక సదుపాయాల కల్పన, నూతన కోర్సుల ఏర్పాటు విషయమై, ఓయూ పరిధిలోని అన్ని కళాశాలలనూ సందర్శించి, వసతులు, భవనాలు, సౌకర్యాల గురించి కూలంకషంగా విషయ సేకరణ జరుపుతున్నామన్నారు. అందులో భాగంగానే జోగిపేట, నర్సాపూర్ పీజీ కాలేజీలను కూడా సందర్శించామన్నారు. కాగా, జోగిపేట పీజీ కాలేజీలో 5 కోర్సులున్నప్పటికీ, ప్రస్తుతం లైబ్రరీ సైన్స్, కెమిస్ట్రీ విభాగాల్లో మాత్రమే పీజీ కోర్సులు కొనసాగిస్తున్నామన్నారు. గతంలో కేటాయించిన ఐదు ఎకరాల స్థలాన్ని వినియోగించు కోలేకపోయామని, అదనంగా మరో పదెకరాల వరకు స్థలాన్ని కేటాయిస్తే గతంలో ప్రారంభించి ఆపివేసిన మిగతా మూడు కోర్సులతో పాటు, కొత్తగా ఎంబీఏ, ఎమ్మెస్సీ (డేటా సైన్స్) కోర్సులనూ ప్రారంభిస్తామన్నారు.



నర్సాపూర్‌లో పీజీ కాలేజీ సొంతభవనం కోసం కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న వైస్‌చాన్స్‌లర్

స్థలం కోసం తాము మంత్రి దామోదర్, కలెక్టర్ వల్లూరి క్రాంతిని త్వరలో కలుస్తామన్నారు. ఈ సందర్భంగా పీజీ కాలేజీ నడుస్తున్న తాత్కాలిక భవనాన్ని వైస్ చాన్స్‌లర్‌తో పాటు, మిగతా బృందం పరిశీలించింది. కాలేజీలో నెలకొన్న సమస్యలను ప్రిన్సిపాల్ డాక్టర్ గోవర్ధన్ వివరించారు. నర్సాపూర్ పీజీ కళాశాలకు సొంత భవనం లేక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వైస్‌చాన్స్‌లర్‌కు విన్నవించారు. ప్రిన్సిపాల్ మహేశ్వర్‌రెడ్డి కళాశాలలో నెలకొన్న సమస్యలను ఆయనకు తెలిపారు. మరో పది ఎకరాలను కేటాయిస్తే నర్సాపూర్‌లో పీజీ కాలేజీని అన్ని సదుపాయలతో సకల సౌకర్యాలతో నిర్మాణం చేయడానికి నిధులు కేటాయించేలా చూస్తామన్నారు. ఈమేరకు మెదక్ కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. వారి వెంట ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి, ఓఎస్డీ ప్రొఫెసర్ జితేందర్‌నాయక్, జిల్లా పీజీ కాలేజీల డైరెక్టర్ ప్రొఫెసర్ రాజేంద్రనాయక్, తదితరులు ఉన్నారు.

బడులు బాగు చేయకపోతే పేదలకు విద్య దూరం

● రాష్ట్ర విద్యా కమిషన్ సలహాదారులు, ఎంవీఎఫ్ జాతీయ కార్యదర్శి వెంకట్‌రెడ్డి

నిజాంపేట, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడులు బాగు చేయకపోతే పేదలు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉన్నదని రాష్ట్ర విద్యా కమిషన్ సలహాదారులు, ఎంవీఎఫ్ జాతీయ కార్యదర్శి ఆర్.వెంకట్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగ హక్కులు, చట్టాలు, సామాజిక, ఆర్థిక రాజకీయ పరిస్థితుల నాయకత్వ లక్షణాలపై గురువారం డీబీఎఫ్ ఆధ్వర్యంలో నిజాంపేటలో శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ముందుగా విద్యా హక్కుల అమలు పరిస్థితి, సవాళ్లు, పరిష్కారాలు అనే అంశంపై ఆయన మాట్లాడారు. ప్రభుత్వ విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలని, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రతీ మండలంలో నాలుగు ఆధునిక పాఠశాలలను నిర్మించాలని కోరారు. ప్రభుత్వ బడులకు వెళ్లే విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని, ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టి ప్రభుత్వ విద్య పరిరక్షణకు చట్టబద్ధ బాధ్యత చేపట్టాలన్నారు. అలాగే విద్యాహక్కు చట్టాన్ని అమలు చేసి ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం రిజర్వేషన్ కల్పించాలని పేర్కొన్నారు. బుద్ధుడు, పూలే, అంబేడ్కర్ సిద్ధాంతాలను అలవర్చుకోవాలన్నారు. సమాచార హక్కు చట్టం ఒక ఆయుధం లాంటిదని, దీనిని ఉపయోగించుకోవాలని సూచించారు. ఈశిక్షణ శిబిరంలో దుబాసి, సంజీవ్, ఏగొండస్వామి, కె.కరుణాకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంజీరాపై రబ్బర్ డ్యాం

- రాయిపల్లి వంతెన వద్ద నిర్మాణం సాధ్యం
- నీటిపారుదల శాఖ రిటైర్డ్ సీఈ విఠల్‌రావు
- ప్రభుత్వానికి నివేదిస్తాం : ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, మే 22 (ఆంధ్రజ్యోతి) : మంజీరా నదిపై నూతన సాంకేతికతతో రబ్బర్ డ్యాంను నిర్మించాలని ప్రతిపాదనల తయారీకి కసరత్తును ప్రారంభించారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి నివాసంలో గురువారం సాధ్యాసాధ్యాలపై ఇరిగేషన్ రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ విఠల్‌రావు, హైడో కన్‌స్ట్రక్షన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.శ్రీధర్‌రెడ్డి, ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎస్.ప్రకాష్‌రెడ్డి, మనూరు మండల ఇరిగేషన్ ఏఈఈ విద్య సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ విఠల్‌రావు మాట్లాడుతూ మంజీరా నదిపై రాయిపల్లి వంతెన వద్ద రబ్బర్ డ్యాం నిర్మాణం సాధ్యపడుతుందన్నారు. దీని నిర్మాణం వల్ల భారీగా నీటినిల్వ సామర్థ్యం పెరిగి తాగు నీటి పథకాలతో పాటు, సాగునీటికి ఉపయోగపడుతుందన్నారు. 10 నుంచి 12 టీఎంసీల నీటి నిల్వతో పరిసర ప్రాంతాల్లో భూగర్భజలాలు గణనీయంగా పెరిగేందుకు ఆస్కారం ఉందన్నారు. రబ్బర్ డ్యాం 400 మీటర్ల పొడవు, ఐదు మీటర్ల ఎత్తు వరకు నిర్మించుకునే అవకాశం ఉందని తెలిపారు. నీటి ఫ్లోను బట్టి డ్యాం ఎత్తు, తగ్గులు చేసుకునే వీలుందన్నారు. డ్యాం వల్ల పూడిక నిండే సమస్య ఉండదని, కుడి, ఎడమ కాలువలను సైతం ఏర్పాటు చేసుకొని సాగునీటిని మళ్లించుకునే వీలుంటుందని తెలిపారు.



రబ్బర్ డ్యాం వివరాలను ఎమ్మెల్యేకు వివరిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

పూర్తి అంశాలతో ప్రాజెక్టు రిపోర్టు తయారు చేసి తనకు అందజేస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. జిల్లా రైతులు, తాగునీటి అవసరాలు, భూగర్భజలాల పెంపు లక్ష్యంగా ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రభుత్వం ద్వారా కృషి చేస్తానని చెప్పారు. మంజీరాపై సింగూరు ప్రాజెక్టు నిర్మాణంతో ఖేడ్ నియోజకవర్గ రైతుల ఎక్కువగా భూములు కోల్పోయారని గుర్తుచేశారు. 40 వేల ఎకరాలు ముంపునకు గురైందన్నారు. మంజీరా నదిపై నిర్మించ తలపెట్టిన డ్యాంతో ఖేడ్ ప్రాంతంతో పాటు జిల్లాకు ప్రాజెక్టు అన్ని రకాలుగా ఉపయోగపడాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, మాజీ ఎంపీపీ రమేష్ చౌహాన్, మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధ్వానవనం

మూడేళ్ల నుంచి వృథాగా అర్బన్ ఫారెస్ట్ పార్క్‌లు



మనోహరాబాద్ అర్బన్ పార్క్ (నాడు)



ప్రస్తుతం

పచ్చని చెట్లు.. స్వచ్ఛమైన గాలి.. కట్టిపడేసే ప్రకృతి అందాలు.. ఎటుచూసిన ఆహ్లాదకరమైన వాతావరణం కనిపించే అర్బన్ ఫారెస్ట్ పార్క్‌లు అధ్వానంగా మారాయి. మెదక్ జిల్లాలో కోట్లాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన వడియారం, మనోహరాబాద్, పరికిబండ ఉద్యానవనాలు ప్రారంభానికి నోచుకోకముందే అధ్వానంగా తయారయ్యాయి. నిర్మాణాలు దెబ్బతిని, పిచ్చి మొక్కలతో కళావిహీనంగా మారాయి.

- తూప్రాన్, మే 22(ఆంధ్రజ్యోతి)

- ఇంకా ప్రారంభోత్సవానికి నోచుకోలేదు..
- అప్పుడే దెబ్బతిన్న నిర్మాణాలు
- పిచ్చి మొక్కలతో కళావిహీనం

ఔటర్ రింగ్ రోడ్డుకు వెలుపల ప్రధాన రహదారులకు సమీపంలో అర్బన్ ఫారెస్ట్ పార్కుల ఏర్పాటుకు నిర్ణయించారు. వీటిని వీకెండ్ టూరిస్ట్ స్పాట్లుగా తీర్చిదిద్దడానికి హెచ్‌ఎండీఏ నడుం బిగించింది. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని హైవే 44 పక్కనే దండుపల్లి వద్ద మనోహరాబాద్ అర్బన్ పార్క్, తూప్రాన్ మండలం ఇమాంపూర్ స్టేజీ వద్ద పరికిబండ పార్క్, చేగుంట - మెదక్ రహదారి పక్కనే వడియారం రిజర్వ్ ఫారెస్ట్‌లో పొలంపల్లి వద్ద ఏర్పాటు చేశారు. మనోహరాబాద్ అర్బన్ ఫారెస్టు పార్కుకు రూ.2 కోట్లు, పరికిబండ పార్కుకు రూ.1.16 కోట్లు, వడియారం పార్కుకు రూ.1.14 కోట్ల నిధులు కేటాయించారు. హెచ్‌ఎండీఏ పరిధిలోని అటవీ, ఇంజనీరింగ్ విభాగాలు 2019లో పనులకు శ్రీకారం చుట్టారు. రెండేళ్లలోనే పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని అప్పట్లోనే అధికారులు ప్రకటించారు. కానీ, మూడేళ్ల పాటు పనులు కొనసాగగా, 2022 నాటికి పూర్తి చేశారు. మూడేళ్లవుతున్నా ఇంతవరకు ప్రారంభానికే నోచుకోలేవు.

ఆకర్షణీయంగా.. ఆహ్లాదకరంగా

మనోహరాబాద్ అర్బన్ ఫారెస్టు పార్కులో పరిధిలోని 129 హెక్టార్లలలో 80,317 మొక్కలు నాటగా, పరికిబండ పార్కులోని 220 హెక్టార్లలో 1.30 లక్షల మొక్కలను నాటారు. ప్రధానంగా ఆక్సిజన్ అందజేసే వేప, రావి, మర్రి, ఇప్ప, చింత, తాని, నారేపి, అల్లనేరేడు, మారేడు తదితర మొక్కలు నాటారు. అందమైన వాకింగ్ రోడ్లను ఏర్పాటు చేశారు. వాచ్ టవర్లను నిర్మించారు. ధ్యాన మందిరం, యోగా షెడ్డు ఏర్పాటు చేశారు. సేద తీరేందుకు గుర్రం, తాబేలు, యాపిల్, అరటిపండు, పుచ్చకాయ, కలప ఆకారంలో కూర్చుండే బల్లలను ఏర్పాటు చేశారు. ప్రధాన ద్వారాన్ని ఆకర్షణీయంగా ద్వారం రూపొందించారు. పరికిబండ అర్బన్ ఫారెస్టు పార్కు చుట్టూరా రూ.16 కోట్ల వ్యయంతో 40 కిలోమీటర్ల పొడవున ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. మనోహరాబాద్ అర్బన్ పార్కుకు 4 కిలోమీటర్ల పొడవు ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. వడియారం పార్కు చుట్టూరా 11 కిలోమీటర్ల పొడవు ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.



దెబ్బతిన్న పుచ్చకాయ ఆకారం బెంచీ

ప్రారంభం మరిచిపోయారు..

హెచ్‌ఎండీఏ అర్బన్ ఫారెస్టు పార్కుల నిర్మాణ పనులు ఆరేళ్ల క్రితం 2019లో చేపట్టి 2022 నాటికి పనులు పూర్తి చేశారు. 2022లో అప్పటి మంత్రి హరీశ్‌రావుతో ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేశారు. ఇప్పుడు.. అప్పుడు ప్రారంభోత్సవం అంటూ వాయిదా వేస్తూ వచ్చారు. ప్రారంభం నాటికి మరింత అభివృద్ధి పరిచేందుకు నిర్ణయించారు. ఈ అర్బన్ ఫారెస్టు పార్కుల్లో సైకిల్ ట్రాక్, చిల్డ్రన్స్ ప్లేగ్రౌండ్‌లు ఏర్పాటు చేసే ప్రయత్నాలు చేపట్టి, ఇందుకు ప్రతిపాదనలను కూడా సిద్ధం చేశారు. కానీ, ప్రారంభోత్సవం చేయకపోగా, అర్బన్ ఫారెస్టు పార్కులను పట్టించుకోవడం మరిచిపోయారు.



పరికిబండ పార్క్ (నాడు)



ప్రస్తుతం

నిర్వహణ లేక..

అర్బన్ ఫారెస్టు పార్కులు నిర్మాణం పూర్తిచేశాక నిర్వహణను అటవీశాఖకు అప్పగించారు. ఇప్పటికే నిధులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అటవీశాఖకు అర్బన్ ఫారెస్టు పార్క్‌ల నిర్వహణ తలకుమించిన భారంగా తయారైంది. నిర్వహణను లేక పార్కుల్లో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. చెట్లు సైతం ఎండిపోతున్నాయి. పార్కులో వేసిన రోడ్లు, కళాకృతులు, స్వాగత తోరణాలు దెబ్బతినిపోయాయి. హెచ్‌ఎండీఏ ఏర్పాటు చేసిన అర్బన్ ఫారెస్టు పార్కుల నిర్వహణకు హెచ్‌ఎండీఏ అధికారులు చొరవ తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



నాడు - నేడు

ప్రారంభం నాటికి పార్కులోని రోడ్లు, నిర్వహణ లేక ప్రస్తుతం ఇలా..



నాడు - నేడు

గతంలో గుర్రం ఆకృతి బల్ల, ప్రస్తుతం పిచ్చిమొక్కల మధ్య...

న్యూస్ బాక్స్

మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాల బడ్జెట్ విడుదల

సంగారెడ్డి అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాల బడ్జెట్‌ను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. పీఎం పోషణ్ ద్వారా విద్యార్థులకు అందించే ఏజెన్సీల గౌరవ వేతనాన్ని(కుక్ కమ్ హెల్పర్) రూ.2 వేల చొప్పున రూ.47,73,000 మంజూరయ్యాయి. ఆయా నిధులను కార్మికుల ఖాతాలో జమ చేసినట్టు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

'రోడ్ కం డ్యాం నిర్మించాలి'

నారాయణఖేడ్, మే 22 (ఆంధ్రజ్యోతి) : మంజీరా నదిపై రోడ్ కం డ్యాంను నిర్మించి ప్రజల దాహార్తితో పాటు సాగునీటి అవసరాలు తీర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాణిక్యం కోరారు. గురువారం ఆయన ఖేడ్‌లో మాట్లాడుతూ మంజీరా నది నియోజకవర్గం గుండా ప్రవహిస్తుందని మంజీరాపై సింగూరు ప్రాజెక్టు వల్ల సారవంతమైన భూములు ముంపునకు గురయ్యాయన్నారు. మనూరు మండలం రాయిపల్లి వల్ల రోడ్‌కం డ్యాంను నిర్మిస్తే ఆందోల్, జహీరాబాద్, నారాయణఖేడ్ నియోజకవర్గాల ప్రజల దాహార్తి తీరడానికి తోడు సాగునీరు అందుతుందన్నారు.

పీఏసీఎస్ డైరెక్టర్ కుటుంబానికి పరామర్శ

హత్నూర, మే 22 (ఆంధ్రజ్యోతి) : హత్నూర మండలం గుండ్లమాచునూర్ గ్రామానికి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ బేగరి సాయిలు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా గురువారం కాంగ్రెస్ మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

రిజిస్ట్రేషన్ ప్రారంభం

కల్హేర్, మే 22 (ఆంధ్రజ్యోతి) : ఆధార్ తరహాలో రైతులకు 11 అంకెల విశిష్ట గుర్తింపు కార్డుల జారీకి రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ప్రారంభించినట్లు కల్హేర్ మండల వ్యవసాయ అధికారి వెంకటేశం తెలిపారు. మండల పరిధిలోని మాసాన్‌పల్లిలో ఈ కార్యక్రమాన్ని ఏఈవో సంతోషకుమారితో కలిసి ప్రారంభించారు.

వీవోఏపై చర్యలు తీసుకోవాలి

శివ్వంపేట, మే 22 (ఆంధ్రజ్యోతి) : ఐకేపీ కొనుగోలు కేంద్రంలో వీవోఏ తూకంలో అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో తూకం తక్కువ చూపిస్తూ వీవోఏ తమ కుటుంబసభ్యుల పేర క్రెడిట్ చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒగ్గు సురేష్, చంద్రకళ, పెంజర్ల నర్సింలు, మల్లమ్మ, అగ్రరం నర్సింహులుకు చెందిన 900 ధాన్యం బస్తాల్లో రైస్‌మిల్లులో నాలుగు క్వింటాళ్ల ధాన్యం ఎక్కువగా చూపించడంతో వారు అవాక్కయ్యారు. అక్రమాలకు పాల్పడుతున్న వీవోఏ చంద్రకళపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.

సంగారెడ్డి జిల్లాలో 15 మందికి ఎస్‌ఐలుగా పదోన్నతి

సంగారెడ్డి క్రైం, మే 22 (ఆంధ్రజ్యోతి) : చార్మినార్ మల్టీజోన్-6 పరిధిలో సంగారెడ్డి జిల్లాకు చెందిన ఏఎస్‌ఐలకు ఎస్‌ఐలుగా పదోన్నతి లభించింది. ఈ జోన్ పరిధిలో మొత్తం 95 మంది ఏఎస్‌ఐలకు పదోన్నతి కల్పిస్తూ ఐజీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సంగారెడ్డి జిల్లాలో మొత్తం 15 మంది ఏఎస్‌ఐలు ఎస్‌ఐలుగా పదోన్నతి పొందారు. పదోన్నతి పొందిన వారిలో కె.గంగయ్య, కె.సుధాకర్, ఎం.రాజేందర్, ఎన్ఎస్‌కె రాజు, ఎస్.శ్రీహరి, టి.సంజీవరెడ్డి, శాబూర్ రహమాన్, సంజీవరావు, ఎం.లక్ష్మీనారాయణ, బి.దుర్గయ్య, జి.నారాయణ, వై.మల్లేశ్వర్, ఎం.లక్ష్మణ్‌రావు, సిద్ధయ్య, జి.బిక్షపతిలు ఉన్నారు.

ఇందిరమ్మ ఇంటి నమూనా పనులు ప్రారంభం

వట్‌పల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టే ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పథకంలో భాగంగా మండల కేంద్రమైన వట్‌పల్లిలో ఇంటి నమూనా నిర్మాణం పనులను గురువారం డీఈ మల్లేశం, ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్‌రావు ప్రారంభించి మాట్లాడారు.

'ఎన్నికల్లో గెలవాల్సిందే'

తూప్రాన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో 100 శాతం గెలవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. గురువారం మాజీ జడ్పీటీసీ బస్వన్నగారి సత్యనారాయణగౌడ్ తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిశారు. పార్టీ బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు.



ఖేడ్ పరిధిలోని చాంద్‌ఖాన్‌పల్లి వద్ద తడిసి ముద్దైన ధాన్యం కుప్పలు



వెల్దుర్తిలోని కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం బస్తాలు



ఫుల్‌కల్ : శివంపేట సొసైటీలో బురదలో పర్యటిస్తున్న పౌర సరఫరాల మేనేజర్ అంబదాస్ రాజేశ్వర్

అకాల వర్షంతో ఆగమాగం

- తడిసి ముద్దయిన ధాన్యం
- కొనుగోలు కేంద్రాల్లో బస్తాలకు మొలకలు
- ఆందోళన చెందుతున్న రైతులు

నారాయణఖేడ్/వెల్దుర్తి/ఫుల్‌కల్/రేగోడు/మే 22 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షంతో రైతులు ఆగమవుతున్నారు. బుధవారం, గురువారం ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షంతో ధాన్యం బస్తాలు, కుప్పలు తడిసి ముద్దయ్యాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్లముందే తడిసిపోతుంటే రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని చాంద్‌ఖాన్‌పల్లి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులు విక్రయించేందుకు తీసుకొచ్చిన ధాన్యం కుప్పలు తడిసి ముద్దయ్యాయి. వర్షం వల్ల మామిడికాయలు కూడా నేలరాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెల్దుర్తి మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో గురువారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. వర్షంతో కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిసింది. కొనుగోలు కేంద్రంలోకి భారీ వర్షపు నీరు చేరి చెరువును తలపించింది. వెల్దుర్తి మండల పరిధిలోని కుకునూర్, మంగళపర్తి, మన్నెవారి జలాల్‌పూర్, యశ్వంతరావుపేట గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ బాలలక్ష్మి గురువారం సందర్శించారు. అలాగే వెల్దుర్తిలోని శివసాయి రైస్‌మిల్లును పరిశీలించారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ నర్సింగ్ యాదవ్, రైతులు ఉన్నారు. అలాగే ఫుల్కల్, చౌటకూర్ మండలాల్లో బుధ, గురువారం సాయంత్రం కురిసిన వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో గోదాములకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న బస్తాలన్నీ తడిసి ముద్దయ్యాయి. శివంపేట పీఏసీఎస్‌లో ధాన్యాన్ని కుప్పలు కుప్పలుగా పోసి టార్పాలిన్లు కప్పి ఉంచినా వర్షం ధాటికి పూర్తిగా తడిసిపోయి మొలకలు వచ్చి తీవ్ర దుర్గంధం వ్యాపిస్తున్నది. శివ్వంపేట సొసైటీ, ముదిమాణిక్యం, శివంపేట, కోడూరు గ్రామాల్లోని పలు రైస్ మిల్లులను జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ అంబదాస్ రాజేశ్వర్ గురువారం సందర్శించారు. ధాన్యం బస్తాలు ఖాళీ అయిన లారీలను వెంటవెంటనే కొనుగోలు కేంద్రాలకు పంపించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మనోహరాబాద్ మండలం రామాయపల్లి గ్రామంలో వర్షానికి ఇంటి పైకప్పు, ప్రహరీ కూలిపోయింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రమాదం జరగలేదు. రేగోడు మండలంలోని కొత్వాల్‌పల్లి, చౌదర్‌పల్లి, రేగోడు ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ దత్తారెడ్డి గురువారం పరిశీలించారు. ఆయన వంట రెవెన్యూ సిబ్బంది లక్ష్మణ్, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.

రైతులు అధైర్యపడొద్దు : ఆర్డీవో

అల్లాదుర్గం మే 22 (ఆంధ్రజ్యోతి) : పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోళ్లు చేపడతామని, రైతులు అధైర్యపడొద్దని మెదక్ ఆర్డీవో రమాదేవి అన్నారు. గురువారం అల్లాదుర్గం మండలంలోని గడిపెద్దాపూర్‌లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. రైస్‌మిల్ యాజమానితో మాట్లాడారు. కొనుగోలును వేగవంతంగా చేపట్టాలని ఐకేపీ సిబ్బందికి సూచించారు. వీరి వెంట తహసీల్దార్ మల్లయ్య, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రగతిలో వేగం పెంచాలి

- మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు



సమీక్షలో మాట్లాడుతున్న మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : పేదల జీవితాల్లో వెలుగులు నింపే దిశగా మెదక్ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల ముమ్మర ప్రగతి సాధించాలని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో నియోజకవర్గ అభివృద్ధిపై కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. విద్యా, వైద్యం, వ్యవసాయం, తాగు, సాగునీరు, ఉద్యానవనం, పశుసంవర్థక, మత్స్యశాఖ, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ శాఖల వారీగా పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రోహిత్‌రావు మాట్లాడుతూ.. ప్రజలకు అందించే సంక్షేమ కార్యక్రమాల లక్ష్యాలను పూర్తిచేసి ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇదిలా ఉండగా పరిసరాల పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యపు ధోరణిపై మెదక్, రామాయంపేట మున్సిపల్ కమిషనర్లపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. తీరు మార్చుకోకుండా వ్యవహరిస్తున్నారని, ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. నిర్లక్ష్యం విషయంలో ఉపేక్షించేది లేదన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కట్టమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే



యజ్ఞంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, మే 22 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ పట్టణంలోని జీవన్ ఫంక్షన్‌హాల్ సమీపంలో గురువారం కట్టమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. ఈ సందర్భంగా హోమం, పూజ, విగ్రహ ప్రతిష్ఠాపన తదితర కార్యక్రమాలను పురోహితులు మోహన్ జ్యోషి ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, మాజీ వార్డు సభ్యులు శెట్టి శంకర్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వారిని ఆలయ వ్యవస్థాపకులు నాగం బాల్‌రాజ్, నాగంజీవన్, లక్ష్మణ్ శాలువాలతో సన్మానించారు. అలాగే ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని చాంద్‌ఖాన్‌పల్లిలో కురుమ సంఘం ఆధ్వర్యంలో 16న ప్రారంభమైన బీరప్ప-కామారతి కల్యాణ మహోత్సవాలు గురువారం కొనసాగాయి. గారడి విద్య, రాత్రి కథ తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

పాలన చేతకాకే సీఎం ఫ్రస్టేషన్ : ఎమ్మెల్యే



విలేకరులతో మాట్లాడుతున్న సునీతారెడ్డి

నర్సాపూర్, మే 22 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి పాలన చేతకాక ఫ్రస్టేషన్‌కు గురవుతూ ఏమి చేస్తున్నాడో కూడా తెలియడం లేదని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి విమర్శించారు. గురువారం నర్సాపూర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిన్నర పాలనలో చేసిందేమి లేదని, పైగా ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను మరల్చేందుకే బీఆర్ఎస్ నేతలపై అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారని అందులో భాగమే కేసీఆర్, హరీశ్‌రావులకు నోటీసులని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఒక అద్భుతమైన పథకమని, ఈ ప్రాజెక్టు వల్ల రాష్ట్రంలో లక్షలాది ఎకరాల సాగయ్యే అవకాశముందని, అటువంటి ప్రాజెక్టుపై తప్పుడు ఆరోపణలు చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని కాంగ్రెస్ చూస్తుందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీలు అమలు చేయడంపై దృష్టిపెట్టాలని హితవు పలికారు. కాగా నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, మాజీ జడ్పీటీసీ బబియానాయక్, మాజీ ఎంపీటీసీ సత్యంగౌడ్, నాయకులు సంతోష్‌రెడ్డి, విఠల్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఆపత్కాలంలో ఆపన్నహస్తం సీఎం రిలీఫ్ ఫండ్

- కాంగ్రెస్ నాయకుడు నీలం మధుముదిరాజ్



చెక్కులు అందజేస్తున్న నీలం మధుముదిరాజ్

పటాన్‌చెరు రూరల్, 22 (ఆంధ్రజ్యోతి) : పేదలకు వైద్యం అందించడానికి సీఎం రిలీఫ్ ఫండ్ ఆపత్కాలంలో ఆపన్నహస్తంలా ఆదుకుంటుందని కాంగ్రెస్ నాయకుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. గురువారం పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన నలుగురు లబ్ధిదారులు తెల్లాపూర్ మున్సిపాలిటీ టి.శంకర్, కొండాపురం మండలం టెర్పోల్‌కి చెందిన టి.అనంతయ్య, ఇస్నాపూర్ మున్సిపాలిటీ చిట్కుల్‌కి చెంది కె.పెంటమ్మ, రుద్రారం గ్రామానికి చెందిన సమంతలకు రూ.2,45,000 లక్షల విలువగల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ తెల్లాపూర్ మున్సిపాలిటీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, పటాన్‌చెరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం శ్రీశైలం, రుద్రారం మాజీ ఎంపీటీసీ హరిప్రసాద్ రెడ్డి, ముత్తంగి అశోక్, మధుసూదన్, పాండుయాదవ్, యాదయ్య, జి.వెంకటేష్, ప్రభు, కిట్టు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గుణాత్మక విద్యకోసం బోధనాభ్యాసంలో మార్పులు



శిక్షణ అభ్యాసంలో వివరిస్తున్న డీఈవో

నిజాంపేట/చేగుంట, మే 22 (ఆంధ్రజ్యోతి) : బోధన అభ్యాసంలో మార్పులు తీసుకొచ్చి విద్యార్థులకు గుణాత్మక విద్య అందించడం కోసం ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు మెదక్ డీఈవో రాధాకిషన్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయుల శిక్షణా తరగతులను సందర్శించి తగిన సూచనలు. సలహాలు అందించారు. అనంతరం మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో విద్యార్థులకు అర్థమయ్యేలా చెప్పాలన్నారు. ఆయన వెంట ఎంఈవో సాంగని యాదగిరి, మండల ఉపాధ్యాయులు ఉన్నారు. అలాగే చేగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణా తరగతులను డీఈవో రాధాకిషన్ ఎంఈవో నీరజతో కలిసి సందర్శించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ రాజశేఖర్, మల్లికార్జున్, తిరుపతి, కిషన్, రాజశేఖర్, రంజిత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా తిరంగా యాత్ర



తిరంగాయాత్రను నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

పటాన్‌చెరు/కల్హేర్, మే 22 (ఆంధ్రజ్యోతి) : పాకిస్తాన్‌పై దిగ్విజయంగా ఆపరేషన్ సిందూర్ నిర్వహించి జయకేతనం ఎగరవేసిన భారత్ నేడు ప్రపంచదేశాలలో శక్తివంతమైన దేశంగా ఎదిగిందని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి అన్నారు. పటాన్‌చెరు పట్టణంలో గాంధీ విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు యాత్రను నిర్వహించారు. అలాగే మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు అరుణ్‌రాజ్ శేరికర్, మండల అధ్యక్షుడు శంకర్‌రావ్ పటేల్ పాల్గొన్నారు.

గురుకులాలు ఎత్తివేస్తే పోరాటమే

సంగారెడ్డి రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి) : సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలు ఎత్తివేస్తే పోరాటం తప్పదని కులవివక్ష పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం హెచ్చరించారు. సంగారెడ్డిలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 11 జిల్లాల్లో సాంఘిక సంక్షేమ గురుకులాల్లో గల ఇంటర్మీడియట్ కళాశాలలను ఎత్తివేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని పేర్కొన్నారు.



పటాన్‌చెరులోపూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

వైభవంగా హనుమాన్ జయంతి

మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో హనుమాన్ జయంతిని వైభవంగా నిర్వహించారు. గురువారం ఆయా మండలాల్లోని ఆలయాల్లో క్షీరాభిషేకం, మహా అలంకరణ, మంగళహారతి తదితర కార్యక్రమాలు చేశారు. సామూహిక హనుమాన్ చాలీసా పఠించారు. భక్తులు పెద్దఎత్తున ఆలయాలకు పోటెత్తడంతో సందడి నెలకొన్నది.

- న్యూస్ నెట్‌వర్క్



నర్సాపూర్ మండలం పెద్దచింతకుంట సమీంపలోని జలహనుమాన్ ఆలయంలో పల్లకీసేవలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, తదితరులు

ఎక్కడ చూసినా ఎర్ర సిలిండరే!

5వ పేజీ తరువాయి

ఉండగా, వాణిజ్య కనెక్షన్లు 460 మాత్రమే ఉన్నాయంటే మిగిలినవారంతా సబ్సిడీ డొమెస్టిక్ సిలిండర్లనే వాడుతున్నారని అర్థం చేసుకోవచ్చు. గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధర రూ.922 ఉన్నది. అదే సమయంలో వాణిజ్య వినియోగ గ్యాస్ సిలిండర్‌కు రూ.2,022 ఉంది. అంటే రెట్టింపు కంటే ఎక్కువ తేడా ఉండటంతో గృహవినియోగ సిలిండర్లను వ్యాపారులు అడ్డదారిన తరలిస్తున్నారు. దీంతో, ప్రభుత్వానికి వచ్చే ఆదాయం రాకుండాపోతోంది.

వాహనాలు, చిన్న సిలిండర్లలో రీఫిల్లింగ్

గృహ వినియోగ సిలిండర్ల నుంచి గ్యాస్‌ను వాహనాల్లో రీఫిల్లింగ్ చేస్తున్నారు. మరికొన్ని చోట్ల చిన్న సిలిండర్లలో రీఫిల్లింగ్ చేసి విక్రయిస్తున్నారు. దీంతో వినియోగదారుడికి సరఫరా చేసే సిలిండర్‌లో గ్యాస్ తక్కువగా వస్తోంది. నెలరోజులకు సరిపడా వచ్చే వంటగ్యాస్ 20 రోజులకే ఖాళీ అవుతోందని వినియోగదారులు వాపోతున్నారు. గ్యాస్‌ను సిలిండర్ నుంచి తీసే క్రమంలో వాచర్లు చెడిపోయి ఇంధనం లీక్ అవుతున్నది. ఇంత జరుగుతున్నా టాస్క్‌ఫోర్స్ అధికారులు కానీ, పౌరసరఫరాల శాఖ అధికారులు కానీ చోద్యం చూస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సంఘ సంస్కర్త భాగ్యరెడ్డివర్మకు ఘన నివాళి



భాగ్యరెడ్డివర్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి): దళిత వైతాళికుడు, సంఘ సంస్కర్త ఎం.వీ.భాగ్యరెడ్డివర్మ చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆదర్శమైన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ కొనియాడారు. కలెక్టరేట్‌లో గురువారం భాగ్యరెడ్డివర్మ జయంతిని అధికారికంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే జిల్లా ప్రధాన పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి భాగ్యరెడ్డివర్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తూప్రాన్ మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో భాగ్యరెడ్డివర్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

రాయసముద్రం చెరువు అభివృద్ధిపై సమీక్ష

- కార్పొరేటర్ పుష్పానగేష్

రామచంద్రాపురం టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : 20 కాలనీల పరీవాహక ప్రాంతంలో ఉన్న రాయసముద్రం చెరువును అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు. గురువారం రామచంద్రాపురం వార్డు కమిటీ కార్యాలయంలో హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆ తరువాత చెరువు చుట్టుపక్కల ప్రాంతాల్లో పరిశీలించి మాట్లాడారు. చుట్టుపక్కల కాలనీవాసులకు ఆహ్లాదకరాన్ని పంచేందుకు చెరువును సుందరంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండీఏ ఏఈలు రంజిత్, దివ్యతేజ, డీఈ నరేందర్, నాయకులు పాల్గొన్నారు.

తూప్రాన్ డీఎస్పీగా నరేందర్‌గౌడ్ బాధ్యతల స్వీకరణ

తూప్రాన్, మే 22 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ డీఎస్పీగా జే.నరేందర్‌గౌడ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. తూప్రాన్ డీఎస్పీ సోమవెంకట్‌రెడ్డి నుంచి చార్జీ తీసుకున్నారు. ఈనెల 19న తూప్రాన్ డీఎస్పీ సోమవెంకట్‌రెడ్డిని సైదాబాద్ ఏసీపీగా బదిలీ చేశారు. రాచకొండ కమాండ్ కంట్రోల్‌లో ఏసీపీగా పనిచేస్తున్న జే.నరేందర్‌రెడ్డిని తూప్రాన్ డీఎస్పీగా నియమించారు. తూప్రాన్ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన జే.నరేందర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ అనంతరం ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, అదనపు ఎస్పీ మహేందర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. తూప్రాన్ డీఎస్పీగా పనిచేసి బదిలీపై వెళ్లిన సోమ వెంకట్‌రెడ్డికి ఘనంగా వీడ్కోలు పలికారు.

చౌటకూర్ తహసీల్దార్‌గా సంధ్య



ఫుల్‌కల్, మే 22 (ఆంధ్రజ్యోతి) : చౌటకూర్ మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఎస్.సంధ్య నియమితులయ్యారు. వికారాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో పర్యవేక్షకులుగా విధులు నిర్వహిస్తున్న సంధ్యకు అందోలు-జోగిపేట ఆర్డీవో కార్యాలయంలో పర్యవేక్షకులుగా బదిలీ అయ్యారు. చౌటకూర్ మండల తహసీల్దార్ కార్యాలయానికి కేడర్ స్ట్రెంత్ లేకపోవడంతో ఇన్‌చార్జి మండల తహసీల్దార్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలావుండగా, డీటీసీఎస్ నయాబ్ తహసీల్దార్‌గా నవదీప్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించారు. అయితే అనుదీప్‌ను చౌటకూర్ మండల ఇన్‌చార్జి నయాబ్ తహసీల్దార్‌గా నియమించారు. ఈ మేరకు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా సంధ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు.

ఖేడ్ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా సాయి సంగమేశ్వర్



నారాయణఖేడ్, మే 22 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా భోగి సాయి సంగమేశ్వర్ ఎన్నికయ్యారు. లయన్స్‌క్లబ్‌కు 2025-2026 సంవత్సరానికిగాను నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. జోన్ చైర్మన్‌గా రాజ్‌కుమార్, అధ్యక్షుడిగా సాయిసంగమేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా బల్లెపు మల్లేష్, కోశాధికారిగా నర్సింహారెడ్డి ఎన్నికయ్యారు. జూలై 1 నుంచి వీరి పదవీకాలం ప్రారంభంకానుంది. నూతన కార్యవర్గానికి చార్టర్ ప్రెసిడెంట్ స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డితో పాటు లయన్స్‌క్లబ్ సీనియర్ బాధ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

తూప్రాన్‌లో ఉమెన్ ఫర్ ట్రీస్

తూప్రాన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ పట్టణ పరిధి పడాలపల్లి 11వ వార్డులో అమృత్ మిత్ర కార్యక్రమంలో ఉమెన్ ఫర్ ట్రీస్ కార్యక్రమం నిర్వహించారు. మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

డ్రైనేజీ పనులు చేపట్టాలి

తూప్రాన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ పట్టణ పరిధి హైదర్‌గూడలో డ్రైనేజీ పనులు చేపట్టాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మంజూరు చేసి కొలతలు వేసినా నిర్మాణం చేపట్టడం లేదరు. వెంటనే నిర్మాణం చేపట్టి, మురుగు నుంచి ఇబ్బందులు లేకుండా చేయాలన్నారు.